
తాడిచెట్లు పంచేవాడు. ఆ పంపకంలో చెట్లు మారుతుం టాయి. అదృష్టవంతునికి బాగా కల్లుపారే చెట్లు వస్తాయి. గొర్ల మందలతో గొర్రెలకు పేర్లు ఉన్నట్టే.. వనంలోని తాళ్లకు కూడా పేర్లు ఉంటాయి. ఆ పేర్లు కూడా గౌడ కులస్థులకే తెలుస్తాయి.

రెండు పర్యాయాలు అధ్యక్షుని హోదాలో ప్రభుత్వ, ఇతర కార్యక్రమాలు నిర్వహించడం వల్ల తన గీతవృత్తికి సమయం సరిపోకపోవడం వల్ల అధ్యక్ష పదవి నుంచి తప్పుకొన్నాడు వీరస్వామి. అతనికి రెండెకరాల పొలం ఉన్నది. ఇద్దరు పిల్లలు. బిడ్డ పెద్దది. ఆ తర్వాత ఐదేం డ్లకు కొడుకు పుట్టాడు. బాబుకు సాయినాథ్ గౌడ్ అని పేరు పెట్టుకొని.. అల్లారుముద్దుగా పెంచాడు. బిడ్డను పట్నంలోనే ఒక ల్యాబులో పనిచేసే అబ్బాయికి ఇచ్చి పెళ్లి చేశారు. కొడుకు ఊళ్లోనే పది దాకా చదివి, ఆ తర్వాత డిగ్రీదాకా పట్నంలో చదివాడు.

గౌడ కులస్థులకు వాళ్ల సంప్రదాయం ప్రకారంగా దసరా పండుగకంటే 15 – 20 రోజుల ముందు కొత్త మామూలు ప్రారంభం అవుతుంది. వనంలోని ఎల్లమ్మ తల్లి గుడికి రంగులు వేసి, దానిచుట్టూ ఈత, తాటి కమ్మ లతో విశాలమైన పందిళ్లు వేసి.. వారం రోజులు జాతర చేస్తారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. సాధనగాళ్లతో గౌడ పురాణాలు చెప్పిస్తారు. పిల్లాపెద్దా అందరూ కలిసి గొర్రెలు, మేకలు, కోళ్లు కోసుకొని వంటలు చేసుకొని ఆనందంగా ఆరగిస్తారు. వాతావ రణం సహకరించి చెట్లు బాగా కల్లు పారాలనీ, ప్రమా దాలు జరగకుండా కాపాడాలనీ ఎల్లమ్మ దేవతను వేడు కుంటారు. మోకులు, ముత్తాడులు పాతవడినట్లయితే.. వాటి స్థానంలో తిరిగి కొత్తవాటిని తయారు చేసుకుం టారు.

అటు పొలం పని.. ఇటు గీత పని చేసుకుంటూ రెండు సంవత్సరాల క్రితం పోద్దాళ్ల సీజన్ ప్రారంభంలో పాత మోకు స్థానంలో కొత్తది తయారుచేసు కోవాలని నిర్ణయిం



చుకున్నాడు వీరస్వామి. పట్నం వెళ్లి దానికి కావాల్సిన దారాలు, సైకిల్ టైర్.. మరిన్ని వస్తువులు తెచ్చుకొని బందవస్తుగా తయారుచేసుకున్నాడు.

పోద్దాళ్ల గెలలు, తాడిచెట్టు మట్టల నుంచి బయటికి వెళ్లగానే.. పాతమోకు స్థానంలో కొత్తమోకు పట్టుకొని వారం రోజులు తాళ్లు ఎక్కాడు వీరస్వామి. పోద్దాళ్లు ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం.. మూడుసార్లు క్రమం తప్పకుండా గీయాలి.

ఆరోజు ఎప్పట్లాగే సూర్యోదయానికంటే ముందే ముత్తాడు నడుముకు కట్టుకొని, మోకు భుజానికి తగిలిం చుకొని కాళ్ల గుజ చేతపట్టుకొని వనానికి పోయాడు వీర స్వామి. తనకున్న మూడు పోద్దాళ్లలో రెండు ఎక్కి, రెండు కుండలలో కల్లు దించి తను కల్లు అమ్ముకునే స్థలం.. మర్రిచెట్టు కిందపెట్టి, మూడో చెట్టు దగ్గరికి చేరు కున్నాడు. రాత్రంతా మంచు కురిసినందున చెట్టు తడిసి ఉంది. అలా మంచుతో తడిసిన తాళ్లు, ఈదులు ఎక్కి కల్లు గీయడం గౌడ కులస్థులకు మామూలు పనే! కానీ, కొన్ని కొన్ని జాగ్రత్తలు పాటిస్తారు.

యథావిధిగా నడుముకు కట్టుకున్న ముత్తాడు మెనుక కత్తుల గుత్తిలోని రెండు కత్తులు తీసి, నెర్సుబండ పోడి తోటి పదునుపెట్టి తిరిగి వాటిని గుత్తిలో పెట్టాడు. భుజా నికున్న మోకును చెట్టుచుట్టూ వేసి.. ముడికి లాక్ చేసి, ఒక్కసారి మోకును సరిచూసుకున్నాడు. తర్వాత కాళ్లకు గుజి తగిలించుకొని, చెట్టుకు మొక్కి పైకి ఎగబాకాడు. చెట్టు తలభాగానికి చేరుకున్నాక.. నాలుగు గెలలకు కట్టి ఉన్న కుండల్లోని కల్లును ఒక కుండలో పోసి.. కుండను ముత్తాడు వెనుక కొక్కానికి తగిలించి.. కత్తి తీసి గెలల కొనలు చెక్కి, ఎప్పట్లాగే వాటికి కుండలు కట్టాడు. కిందికి దిగుతూ ఉండగా.. మంచు తడి కారణంగా ఒక్క సారిగా మోకు జారింది. పట్టుతప్పి కిందపడిపోయాడు వీరస్వామి.

''అమ్మా!'' అన్న గావుకేకతో.. సమీపంలో ఉన్న గౌడ కులస్థులు ఉన్నపళంగా పరిగెత్తుకొని వచ్చారు.

వీరస్వామి మాట పోలేదు. కానీ, విపరీతమైన నొప్పితో లేవలేకుండా నడుం పట్టుకొని మూలుగుతు న్నాడు. 108కి ఫోన్ చేస్తే.. ఆలస్యం అవుతుందని రోజూ కల్లు కోసం వనం దగ్గరికే వచ్చే ఒక ఆటోను మాట్లాడు కొని.. సమీపంలోని హాస్పిటల్‌కు తీసుకువెళ్లారు. అక్కడ వీరస్వామిని పరీక్షించిన డాక్టర్.. వెన్నుపూస ఎముకలో ఫ్రాక్చర్ అయ్యిందనీ, పెద్దాసుపత్రికి తీసుకెళ్లాలని చెప్పారు. వెంటనే పట్నం తీసుకుపోయి పెద్దాసుపత్రిలో చూపించారు. అక్కడ ఎక్స్‌రే తీసిన డాక్టర్.. వెన్నుపూ సలో రెండుచోట్ల ఎముకలు విరిగాయని చెప్పాడు. అవి అతుక్కునే అవకాశం లేదనీ, జీవితాంతం మంచానికే పరిమితం అవుతాడనీ తేల్చిచెప్పాడు. 15 రోజులపాటు ఆసుపత్రిలోనే ట్రీట్‌మెంట్ అందించారు.

ఎక్సయిజ్ అధికారులు పంచనామా చేసి, పైఅధికారు లకు నివేదిక సమర్పిస్తే.. ఆరు నెలల్లోపే వీరస్వామిని శాశ్వత వికలాంగుడిగా గుర్తించి, తనకు రావాల్సిన రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా అందజేసింది. ఉన్న ఒక్కగా నొక్క కొడుకు సాయినాథ్ డిగ్రీ పూర్తిచేసినా.. ఏదో ఒక పనిచేసుకొని సంపాదించుకునే స్థాయికి వచ్చినా.. అతిగా రాబం కారణంగా ఇటు గీతవృత్తి పని, అటే వేరే ఏదైనా పనిచేయడంపై దృష్టిపెట్టకుండా, బండి పట్టుకొని స్నేహి తులతో కలిసి ఆవారాగా తిరుగుతున్నాడు.

వీరస్వామి భార్య వరమ్మ నిస్సహాయురాలై తీవ్ర మనస్తాపంతో బాధపడుతున్న సమయంలో వీరస్వామి స్నేహితుడు పరంధాములు గౌడ్ ముందుకొచ్చి..

''అక్కా! నువ్వేం బాధపడకు. స్వామి బావ బాపతు తాళ్లు, ఈదులు నేను చూసుకుంటా!'' అని భరోసా ఇచ్చాడు.

తనకు కష్టమైనా, వీరస్వామి బాపతు తాళ్లు, ఈదులు గీసుకుంటూ, వాటికి పారిన కల్లును వరమ్మకు అప్పగిస్తున్నాడు పరంధాములు.

అప్పటినుంచి వరమ్మే తనకు వచ్చిన కల్లు వాటాలో పరంధాములు కష్టానికి ప్రతిఫలంగా కొంత కల్లును అప్పగించి, మిగలిన కల్లును వనం మండువాలో అమ్ము తున్నది. వచ్చిన డబ్బుతో భర్త ఆలనాపాలనా చూసు కుంటూ.. వీరస్వామికి పసిబిడ్డలా సేవలు చేస్తూ జీవనం సాగిస్తున్నది.

* * *

కాలకృత్యాలు తీర్చుకొని చక్రాల కుర్చీలో మంచం దగ్గరికి వచ్చాక.. వీరస్వామిని మెల్లిగా కుర్చీలోంచి లేపి, మంచంలో పడుకోబెట్టింది వరమ్మ. ఒక గ్లాసులో చాయ, చిన్న ప్లేటులో నాలుగు బిస్కెట్లు తెచ్చి, తిని పిచ్చి.. చాయ తాగించింది.

ఇంతలో బయటినుంచి..

''అక్కా..'' అన్న పరంధాములు పిలుపు విని, ఖాళీ చాయగ్లాసు, ప్లేటును పక్కనున్న స్టూలుపై పెట్టి.. వేసుకో వాల్సిన ట్యాబ్లెట్లను భర్త చేతిలో పెట్టి..

''ఆ.. వత్తన్న వత్తన్న తమ్మీ!'' అంటూ, బయటికి వెళ్లింది వరమ్మ.

''అక్కా.. ఇప్పుడిప్పుడే పోద్దాళ్ల గెలలొత్తాన్నయ్. మొన్న జెప్పినగదా! కొత్త కుండలు కట్టాల్నని. తెచ్చి నవా!?'' అంటూ, తన బండి స్టాండ్ వేసి అడిగిండు పరంధాములు.

''ఆ.. తెచ్చిన తమ్మీ! నిన్న మాపటీలే కుమ్మరి కొంరయ్య ఇంటికి పోయి.. నాలుగు కుండలు తెచ్చిన. అగో.. ఇప్పుడే మంచిగ పీసేశి కడిగి, ఎండపొడకు ఆరబె ట్టిన!'' అంటూ, కుండల దిక్కు చూపించింది.

''ఎంతకోటి వడ్డది.. రేటు బాగనే పెంచిండట కదా.. కొంరయ్య!''.

''అవును గావచ్చు. శిన్నదైనా, పెద్దదైనా.. కుండకు వంద రూపాలన్నడు. కొసరంగ కొసరంగ ఎనభైకొకటి ఇచ్చిండు!''.

''ఏదో పోనీతియ్! అన్నిటికీ ధరలు పెరుగుతున్నయి గదా! శెల్లకెల్లి మట్టిదెచ్చి, నీళ్లు వోశి కలిపి.. ర్యాకమీద ఇగురంగ వంగి, కుండ జేశి.. తీసి ఎండవెట్టి.. ఉనుక, కట్టెలతోని బట్టీవెట్టి కాలువాల్నంటె వట్టిగనే అయి తదా!? అవుగని అక్కా.. బావకెట్లున్నది?''.

''గట్నే ఉన్నది తమ్మీ! ఇగ లేశి తిరిగే ఆశలేదు. వయసు గూడ పెర్గుతాంది గదా! మనిషింకా శాతగా కుండ అయితాండు. కొడుకు శేతికొచ్చిండుగనీ.. వాని ఆసరా అసలే లేదు. తింటాండు. బండేసుకొని బజార్ల